సీఎం గారూ నేతన్నలను ఆదుకోండి

- బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వండి
- చేనేత రుణ మాఫీ చేసి ఆదుకోండి
- సర్కారుకు చేనేత కార్మిక సంఘం వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉపాధి కోల్పోయి విలవిల్లాడుతున్న చేనేత కార్మికులకు ఉపాధి చూపి ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నేతన్నలను పూర్తిగా మరిచిందని పేర్కొన్నారు. గత 2017 నుంచి 2023 వరకు ఎంతో ఆర్థికంగా ఎదిగిన నేతన్నల పొట్టలుగొట్టి, వారి ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమైందని తెలిపారు. ఈ ఏడాది నుంచి నేతన్నలకు బతుకమ్మ చీరల తయారీ బాధ్యతలను ఇవ్వకపోవడంతో ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితులు దాపురించాయని తెలిపారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు. సీఎంకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్న అంశాలు ఇలా ఉన్నాయి.

- నేతన్నకు చేయూత పథకంలో కొందరు వాయిదాలను మధ్యలోనే నిలిపేశారు. అలాంటి వారికోసం కొంత నగదును బ్యాంకుల్లో ప్రభుత్వం జమచేసి న్యాయం చేయాలి.
- చేనేతమిత్ర కింద 40 శాతంతో నూలు సబ్సిడీ, నేరుగా వీవర్‌కు రూ.2,000, వర్కర్‌కు రూ.500 చొప్పున 2023 అక్టోబర్ వరకు గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడమే లేదు. 2023 నవంబర్ నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద బెనిఫిట్స్ ఇవ్వాలి.
- రూ.2 లక్షల వరకు చేనేతల రుణ మాఫీ చేయాలి.
- 80 ఏండ్ల వయసున్న నేతన్నలకు బీమా పథకాన్ని వర్తింపజేయాలి.
- చేనేత కార్మికుల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను నేరుగా సర్కారు కొనుగోలు చేసి, వారిని ఆదుకోవాలి.
- ఇండ్లు లేని నేతన్నలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి. స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల సాయం అందచేయాలి.

కంటతడి పెట్టించడమే కాంగ్రెస్ మార్పా?

రైతుల ఇండ్ల మీదికి బ్యాంకర్లు.. పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు

ఇదేనా కాంగ్రెస్ మార్క్ మార్పు • ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రైతులను, పేదలను కంటతడి పెట్టించడమే కాంగ్రెస్ మార్క్ మార్పు? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇండ్ల మీదికి బుల్డోజర్లు, రైతుల ఇండ్లపైకి బ్యాంకు అధికారులు.. ఇదేనా? 'మార్పు'? అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీపై ముఖ్యమంత్రి నిర్వాకానికి మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో రైతుపై బ్యాంక్ అధికారుల దౌర్జన్యమే నిదర్శనమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణ మాఫీ పేరిట రేవంత్‌రెడ్డి చేసిన మోసం రైతులపాలిట శాపంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. బ్యాంకు సిబ్బంది రైతుల ఇండ్లపై బడి తలుపులు పీకుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. రైతుపై బ్యాంక్ అధికారుల దౌర్జన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత దిగజారుడు తనమా? ఇంత దౌర్జన్యమా? సీఎం రేవంత్‌రెడ్డి చేసిన నిర్వాకానికి రైతుల పరువు బజారున పడుతున్నదని తెలిపారు.

రైతులపై కేసు పెట్టండి

- లక్ష ఖర్చయ్యే దాకా తిరుగుతరు
- రుణమాఫీ కోసం నిరసన చేస్తరా?
- కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి ప్రతాపం

రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

sకోదాడ, సెప్టెంబర్ 25: రుణమాఫీకి అర్హులైనప్పటికీ ప్రభుత్వం మాఫీ చెయ్యలేదన్న ఆవేదనతో రైతులు శాంతియుతంగా నిరసనకు దిగితే.. ఓ పోలీస్ అధికారి తన ప్రతాపం చూపారు. 'రైతులందరినీ కస్టడీలోకి తీసుకుని కేసులు పెట్టండి.. లక్ష రూపాయలు ఖర్చయ్యే తిరుగుతరు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన 42 మంది రైతులు తమకు అన్ని అర్హతలున్నప్పటికీ రుణమాఫీ కాలేదని బుధవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. అధికారులు ఆన్‌లైన్‌లో తప్పులు చేయడంతో తమకు రుణమాఫీ కాలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. రుణమాఫీ కాలేదంటే అధికారులకు చెప్పాలే గానీ ఆఫీసుకు తాళం వేస్తారా అంటూ సీరియస్ అయ్యారు. 'రూ.లక్ష రుణ మాఫీ కోసం ఆందోళన చేస్తారా? ఇది ఏం నిరసన? అందరినీ కస్టడీలోకి తీసుకుని కేసులు పెట్టండి. లక్ష రూపాయలు ఖర్చయ్యే తిరుగతరు' అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. తమకు అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో నిరసన తెలిపేందుకు వస్తే.. పోలీసులు కేసుల పేరుతో భయపెట్టడం ఎంతవరకు న్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పెండ్లైన కూతురుకు ఉద్యోగం ఉందని మాఫీ చేయలే

- ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ గ్రామ రైతు ఆవేదన
- రుణమాఫీ అయ్యేలా చూడాలని మాజీ మంత్రి హరీశ్‌కు లేఖ

రాంరెడ్డి, రైతు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): 'నేను ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్నా. నా భార్య సవిత పేరిట సహకార బ్యాంకులో రూ.40 వేల అప్పు ఉంది. మాకు మేఘన, సమీరా కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు మేఘనకు 2019లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. 2002లో వివాహం చేసి భర్త ఇంటికి పంపాను. రేషన్‌కార్డులో కూతురు పేరును తీసేయించా. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులో నా పేరుతోపాటు భార్య సవిత, చిన్నమ్మాయి సమీరా పేర్లు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీకి అన్ని విధాలుగా అర్హునిగా ఉన్న నాకు బ్యాంకు లోన్ మాఫీ కాలేదు. అధికారులను అడిగితే మీ కూతురుకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నందు వల్లే రుణమాఫీ కాలేదని చెప్తున్నరు' అని కౌఠకు చెందిన రైతు అల్లూరి రాంరెడ్డి ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. ఈ మేరకు అల్లూరి రాంరెడ్డి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు లేఖ రాసి తనకు రుణమాఫీ జరిగేలా చూడాలంటూ వేడుకున్నాడు. ప్రస్తుత రేషన్‌కార్డులో వివాహం అయిన తన కూతురు పేరు లేకున్నా.. ఉందంటూ అధికారులు రుణమాఫీ చేయలేదని మంత్రికి విన్నవించాడు. తన వంటి సన్నకారు రైతులు రూ.2 లక్షల రుణమాఫీకి నోచుకోవడం లేదని లేఖలో వివరించాడు. రుణమాఫీపై బీఆర్ఎస్ పోరాటం చేయడం మంచి పరిణామమని పేర్కొన్నాడు. తన వంటి సన్నకారు రైతులకు అన్యాయం చేయడం సరికాదంటూ లేఖలో ఆవేదన వ్యక్తంచేశాడు.

రుణమాఫీ చేయాలని బ్యాంకుకు తాళం

సిద్దిపేట జిల్లా తోటపల్లిలో రైతుల నిరసన

సిద్దిపేట జిల్లా తోటపల్లిలో ఇండియన్ బ్యాంకుకు తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

బెజ్జంకి, సెప్టెంబర్ 25 : రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట జిల్లా తోటపల్లిలో ఇండియన్ బ్యాంకుకు రైతులు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ బ్యాంకు బ్రాంచి పరిధిలో 1,407 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. వీరిలో కేవలం 400 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించింది. మిగతా వారికి మాఫీ కాకపోవడంతో గత నెల ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వివరాలు పంపామని బ్యాంకు అధికారులు చెప్పినా, ఇప్పటికీ మాఫీ కాకపోవడంతో బుధవారం బ్యాంకుకు తాళం వేసి నిరసన తెలిపారు. అర్హులైన రైతులందరికీ బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

బీఆర్ఎస్ నేతల ఇండ్లపై దాడులు.. సీఎం మామ ఇంటికి రక్షణ

- దాడుల నిందితులను ఇప్పటికీ అరెస్ట్ చేయని పోలీసులు
- సీఎం మామ పద్మారెడ్డి ఇంటికి 24 గంటల భద్రత
- నెలకు రూ. 5 లక్షలకు ఖర్చవుతుందని అంచనా

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లపై దాడులకు తెగబడుతున్న కాంగ్రెస్ కార్యకర్తల అరెస్ట్ విషయాన్ని పట్టించుకోని పోలీసులు.. సీఎం బంధుగణానికి మాత్రం 24 గంటల భద్రత కల్పించడంలో తలమునకలయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ పద్మారెడ్డి ఇంటికి భద్రత ఏర్పాటు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని పద్మారెడ్డి ఇంటివద్ద ఏర్పాటు చేయాల్సిన భద్రత, అందుకు అధికారికంగా చేయాల్సిన లాంఛనాలను పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నారు. పైనుంచి ఆదేశాలు రాగానే ఆయన ఇంటి వద్ద 24/7 భద్రత ఉండేలా గార్డ్ విజన్ సహా అన్ని ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. మెన్ అండ్ మెషీన్ సహా అన్ని వివరాలతో కూడిన ఫైల్ ఇప్పటికే డీజీపీకి చేరిందని సమాచారం. ముఖ్యమంత్రి మామ పద్మారెడ్డి ఇంటి భద్రతకు నెలకు రూ. 5 లక్షలు అవుతుందని అంచనా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లపై వరుసగా దాడులు జరుగుతున్నా కనీస ఏర్పాట్లు చేయని పోలీసు యంత్రాంగం సీఎం మామ ఇంటి విషయంలో మాత్రం చకచకా ఏర్పాట్లు చేస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

మందమర్రిలో ఎస్‌వోటు జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

లాభాల్లో 33 శాతం వాటా చెల్లించాలి

సీసీసీ నస్పూర్/మందమర్రి/రెబ్బెన, సెప్టెంబర్ 25 : సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు 33 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు బుధవారం ఆందోళనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

వేతనాలు ఇప్పించండి మహాప్రభో..

ప్రభుత్వానికి గురుకుల పార్ట్ టైం ఉద్యోగుల మొర

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): 'కుటుంబాలను పోషించుకోలేకపోతున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ పెద్దలు సత్వరమే స్పందించి 4నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలి. మమ్మల్ని ఆదుకోండి మహాప్రభో' అంటూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పార్ట్ టైం ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్లపాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ప్రతినెలా 10వ తేదీ లోపునే వేతనాలు అందించిందని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల హామీలతో ప్రజలను వంచించినట్టే తమను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నదని వాపోతున్నారు. తమకు వేతనాలు ఇవ్వకపోవడమే కాకుండా, విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు, కాంట్రాక్టర్ల బిల్లులను కూడా చెల్లించడం లేదని, దీంతో కాంట్రాక్టర్లు కూరగాయలు, గుడ్లు, ఫుడ్ ప్రొవిజన్స్ ఇవ్వడం లేదని వెల్లడించారు. పాఠశాలలు మూతపడి పేద విద్యార్థులు నష్టపోయే రోజులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

లంచానికి దసరా డిస్కౌంట్!

- రైస్ మిల్లర్లకు ధాన్యం బిడ్డర్ల ఆఫర్
- మొన్నటివరకు ప్రతి క్వింటాలుపై అదనంగా రూ.230 వసూలు
- ఇప్పుడు రూ.30 తగ్గింపు
- ధాన్యం ఇస్తామన్నా వద్దంటున్న బిడ్డర్లు
- డబ్బులే ఇవ్వాలని డిమాండ్
- మొత్తం డబ్బులు 15 రోజుల్లో వసూలు చేయాలని టార్గెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): షాపింగ్ మాల్స్‌లో కొనుగోలుదారులకు దసరా డిస్కౌంట్లు ఇచ్చినట్టుగా ఇప్పుడు పౌరసరఫరాల శాఖలో ధాన్యం టెండర్లను దక్కించుకున్న బిడ్డర్లు సైతం రైస్ మిల్లర్లకు ఇదే తరహా ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. మొన్నటివరకు ప్రతి క్వింటాలు ధాన్యానికి అదనంగా వసూలు చేసిన రూ.230లో ఇప్పుడు రూ.30 తగ్గించినట్టు మిల్లర్లలో జోరుగా చర్చ జరుగుతున్నది. దీంతో అవినీతికి కూడా డిస్కౌంట్ ఇస్తున్నారంటూ ఓ మిల్లర్ వ్యాఖ్యానించారు. ధాన్యాన్ని ఇచ్చేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నప్పటికీ బిడ్డర్లు మాత్రం తమకు ధాన్యం వద్దని, డబ్బులే ఇవ్వాలని పట్టుబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దసరా డిస్కౌంట్ రూ.30

2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ప్రభుత్వం 35 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం వేసింది. ఈ ధాన్యాన్ని దక్కించుకున్న బిడ్డర్లు.. మిల్లర్ల నుంచి ధాన్యం తీసుకెళ్లాలి. కానీ, ఇందుకు విరుద్ధంగా ఆ ధాన్యానికి ఎంత విలువ ఉంటే అంత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు మిల్లర్లు చెప్తున్నారు. తమ వద్ద ఉన్న ధాన్యాన్ని తీసుకెళ్లాలని చెప్తున్నప్పటికీ బిడ్డర్లు మాత్రం సపేమిరా అంటున్నారని మండిపడుతున్నారు. వేలంలో క్వింటాలు ధాన్యం సగటు ధర రూ.2 వేలు పలకడంతో దానికి అదనంగా రూ.230 కలిపి మొత్తం రూ.2,230 చొప్పున చెల్లించాలని బిడ్డర్లు డిమాండ్ చేసినట్టు తెలుస్తున్నది. దీనికి మిల్లర్లు ససేమిరా అనడంతో దసరా ఆఫర్ కింద క్వింటాలుకు రూ.30 చొప్పున తగ్గించి, మిగిలిన మొత్తాన్ని 15 రోజుల్లోగా చెల్లించాలని బిడ్డర్లు గడువు విధించినట్టు సమాచారం. దీనిపై మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం ఇస్తామన్నా తీసుకోకుండా అదనంగా డబ్బులు వసూలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

వసూళ్లకు 15 రోజుల టార్గెట్

టెండర్ ధాన్యానికి బదులుగా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న విషయం బహిరంగ రహస్యమే. ఇది ఉన్నతాధికారులు తెలియకుండానే జరుగుతున్నదా? లేక వారికి తెలిసినా తెలియనట్టు వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. టెండర్ ధాన్యాన్ని ఎత్తేందుకు బిడ్డర్లకు ఇచ్చిన గడువు ఈ నెల 23తో ముగిసింది. దీంతో ఈ గడువును పొడగించి 15 రోజుల్లో మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. వీలైనంత ఒత్తిడి తీసుకొచ్చి నయానో భయానో వారి నుంచి వసూలు చేసేందుకు బిడ్డర్లు ప్రణాళికలు రూపొందించుకున్నట్టు తెలుస్తున్నది. దీనికి అధికారులు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీబీఐ తీరుపై కోర్టు ఆగ్రహం

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు విచారణ 4కు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసుపై రౌస్ ఎవెన్యూ కోర్టు బుధవారం విచారణ జరిపింది. ప్రతివాదులను వర్చువల్‌గా విచారించింది. ఆ చార్జిషీట్‌లోని కొన్ని పేజీలను తెలుగు నుంచి ఇంగ్లిష్‌లోకి అనువాదించి ఇవ్వాలని గతంలో కోర్టు ఆదేశించినప్పటికీ సీబీఐ అధికారులు మళ్లీ అవే కాపీలను ప్రతివాదులకు పంపడంపై ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతివాదులకు స్పష్టమైన చార్జిషీట్ ప్రతులను అందజేయాలని సీబీఐని ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను అక్టోబర్ 4కు వాయిదా వేశారు.

ఏపీలో ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, సెప్టెంబర్25 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో 16 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ ఐజీగా వినీత్ బ్రిజ్ లాల్‌ను, పీ అండ్ ఎల్ ఐజీగా ఎం రవి ప్రకాశ్‌ను, ఇంటెలిజెన్స్ ఐజీగా పీహెచ్ డీ రామకృష్ణను, ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఫకీరప్పను బదిలీ చేశారు. అమ్మిరెడ్డిని డీజీపీ కార్యాలయంలో డీఐజీ అడ్మిన్‌గా, సీహెచ్ విజయరావుకు రోడ్ సేఫ్టీ అథారిటీగా, సిద్ధార్థ్ కౌషల్‌కు శాంతి భద్రతల ఏఐజీగా, మేరీ ప్రశాంతిని విశాఖ శాంతి భద్రతల డీసీపీ-2గా నియమించారు. తుహిన్ సిన్హాను అనకాపల్లి ఎస్పీగా, ఎం దీపికను ఏపీఎస్పీ-3 బెటాలియన్ కమాండెంట్‌గా, జీ రాధికకు ఒంగోలులోని పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఆరిఫ్ హఫీజ్‌కు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డిని పీటీవో ఎస్పీగా నియమించారు. బాపూజీ అట్టాడ, కేవీ శ్రీనివాసరావును పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కే తిరుమలేశ్వర్‌రెడ్డిని ఎన్టీఆర్ కమిషనరేట్‌లో క్రైమ్ డీసీపీగా నియమించారు.

రేప్ కేసులో నటుడి అరెస్ట్

న్యూఢిల్లీ: మహిళా నటిపై లైంగిక దాడి కేసులో మళయాళ నటుడు, ఎడవెల బాబును సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. 'అమ్మ'లో సభ్యత్వం నిమిత్తం దరఖాస్తు నింపేందుకు బాబు నివాసానికి వెళ్లినప్పుడు అఘాయిత్యానికి పాల్పడినట్టు బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నటుడిని అరెస్ట్ చేశారు.

బలవంతంగా 'డబుల్' ఇండ్లు ఖాళీ

- పెట్రోల్ పోసుకుని లబ్ధిదారుల ఆత్మహత్యాయత్నం
- జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో ఘటన

జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఎల్లరాయినితొర్రూరు జే గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లను ఖాళీ చేయిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 25: జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఎల్లరాయినితొర్రూరు జే గ్రామంలో బుధవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు డబుల్ బెడ్రూం ఇండ్ల నుంచి లబ్ధిదారులను బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో పసులాది ఆంజమ్మ, జోగు ఇందిర, గడ్డం భూలక్ష్మి పెట్రోల్ పోసుకుని తగలబెట్టుకునే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం పేదల కోసం 20 డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేసింది. పూర్తయిన వాటికి రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. పట్టా సర్టిఫికెట్లు మాత్రం ఇవ్వలేదు. అధికారులకు సమాచారమివ్వకుండానే 10 నెలల క్రితం గృహప్రవేశాలు చేశారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సైలు సాయిప్రసన్నకుమార్, సృజన్‌కుమార్, యాకూబ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో గృహాలను ఖాళీ చేయించారు. దీంతో కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే అధికారులు ఇండ్లు ఖాళీ చేయించారని లబ్ధిదారులు మండిపడ్డారు. అక్రమంగా డబుల్ బెడ్రూం ఇండ్లలోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో డీఎస్ వెంకన్న హెచ్చరించారు. త్వరలో గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల కుట్రలతోనే..

కాంగ్రెస్ నాయకుల కుట్రలతోనే మా ఇండ్లను ఖాళీ చేయించిన్రు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేదల కోసం కట్టించి ఇచ్చిన ఇండ్లు ఇవి. గ్రామసభలో మమ్మల్ని ఎంపిక చేసిన్రు. అధికారులు కావాలనే మమ్మల్ని ఖాళీ చేయించిన్రు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, హనుమండ్ల ఝాన్సీరెడ్డిలకు మా పేదల ఉసురుతగులుతది.

-పసులాది లంజమ్మ, లబ్ధిదారురాలు

మూడు గంటల కరెంట్ కట్

ప్రభుత్వ కార్యాలయాల్లో నిలిచిన సేవలు-ఇబ్బంది పడిన ప్రజలు

కరెంట్ లేక ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న అధికారులు

కమలాపూర్, సెప్టెంబర్ 25: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో సుమారు మూడు గంటలు కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం మధ్యాహ్నం 12.30 నుంచి 2.40 గంటల వరకు కరెంటు లేకపోవడంతో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, బ్యాంకుల్లో సేవలు నిలిచిపోవడంతో ప్రజలు, ఖాతాదారులు అసహనం వ్యక్తం చేశారు. తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చింది. గంటల తరబడి కరెంట్ సరఫరా నిలిపివేస్తుండటంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పనులు కాక తిరిగి ఇంటిబాట పడుతున్నారు. ఈ విషయమై కమలాపూర్ ట్రాన్స్‌కో ఏఈని వివరణ కోరగా బస్టాండ్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఏ-బీ స్విచ్ చెడిపోయినందున విద్యుత్తు సరఫరా నిలిపివేసినట్టు తెలిపారు.

- కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రమాదబీమా కల్పించాలని, పీఆర్సీ, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల కార్మికులు ధర్నా చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. - సిరిసిల్ల కలెక్టరేట్

- దొరికినన్ని చేపలు..

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తోమాలపల్లె సమీపంలో జాతీయ రహదారిపై చేపల లోడ్‌తో వెళ్తున్న వాహనం బోల్తాపడింది. దీంతో చేపలన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడగా స్థానికులు దొరికిన కాడికి ఎత్తుకెళ్లారు. దాదాపు 1,100 కిలోల చేపలు ఎత్తుకెళ్లడంతోరూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్టు డ్రైవర్ లీలామోహన్‌రెడ్డి తెలిపారు. - పెబ్బేరు

బస్సు కిందపడి పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 25: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్య కార్మికురాలు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్టులో చోటుచేసుకున్నది. గుంతపల్లికి చెందిన బరిగల రాములమ్మ (67) జీహెచ్ఎంసీలో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. విధులు పూర్తయిన అనంతరం అబ్దుల్లాపూర్‌మెట్టులో పూలు విక్రయిస్తుంటుంది. బుధవారం మధ్యాహ్నం పూలు విక్రయించి గుంతపల్లికి వెళ్లేందుకు అబ్దుల్లాపూర్‌మెట్టులో బస్సు ఎక్కుతుండగా.. డ్రైవర్ ముందుకు కదిలించాడు. దీంతో రాములమ్మ రెండు కాళ్ల పైనుంచి టైరు వెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆమెను కామినేని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

రెచ్చిపోయిన కుక్కలు

ఆరుగురికి గాయాలు

కామారెడ్డి, సెప్టెంబర్ 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలో వీధికుక్కలు బుధవారం నడుచుకుంటూ వెళ్తున్న ఆరుగురిని గాయపరిచాయి. వీరిలో సత్తెవ్వ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. రాజమణి, కళావతితోపాటు మరో ముగ్గురుని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు.

చిరుతపులి చర్మాన్ని చూపిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ, అటవీ శాఖాధికారులు

చిరుతపులి చర్